జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
మహబూబ్‌నగర్
ప్రతి అక్షరం ప్రజల కోసం
నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట
ఆదివారం, జులై 26, 2026 పేజీలు: 8

## ఆధునిక పోలీసింగ్‌కు
# పటిష్ట వ్యవస్థే పునాది

### గద్వాల జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు



**గద్వాల జూలై 25(ప్రజా జ్యోతి ప్రతినిధి):** ఆధునిక పోలీసింగ్‌కు పటిష్టమైన వ్యవస్థ, క్రమబద్ధమైన నిర్వహణే పునాదిగా నిలుస్తుందని జోగుళాంబ గద్వాల జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు పేర్కొన్నారు.శనివారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని పలు విభాగాలను ఆయన క్షుణ్ణంగా తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆర్ఐ స్టోర్,బాంబ్ డిస్పోజల్ (బీడీ) టీమ్,ఆర్ఐ వెల్ఫేర్ కార్యాలయం, ఏఆర్ డీఎస్పీ కార్యాలయం,మోటార్ ట్రాన్స్‌పోర్ట్ (ఎంటీ) విభాగం,బెల్ ఆఫ్ ఆర్మ్స్, హోమ్ గార్డ్స్ కార్యాలయం,జిల్లా కంట్రోల్ రూమ్,కమాండ్ కంట్రోల్ సెంటర్,ఎస్-మ్యాక్ (ఎస్-మాక్) రూమ్ తదితర విభాగాలను పరిశీలించారు.కార్యాలయాల్లో పరిశుభ్రత, కంప్యూటర్లు,కమ్యూనికేషన్ పరికరాలు,రికార్డుల నిర్వహణ,సిబ్బంది పనితీరు,ప్రజలకు అందిస్తున్న సేవలను సమీక్షించిన ఎస్పీ,ప్రతి విభాగంలో 5ఎస్ విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని

## రాజాపూర్ కేజీబీవీలో నూతన కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

### ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని విద్యార్థినులకు కలెక్టర్ ఖుష్బూ గుప్తా పిలుపు



**మహబూబ్‌నగర్, జూలై 25 ( ప్రజా జ్యోతి బ్యూరో )** : రాజాపూర్ మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన నూతన కంప్యూటర్ ల్యాబ్‌ను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా శనివారం ప్రారంభించారు. విద్యార్థినులతో కలిసి రిబ్బన్ కట్ చేసి ల్యాబ్‌ను ప్రారంభించిన కలెక్టర్, విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ఎమ్మెల్యే వ్యక్తిగత నిధులతో కంప్యూటర్లను అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, కేజీబీవీల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, విద్యార్థినులు అందుతున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని జేఈఈ, నీట్, ఎంసెట్, క్లాట్ వంటి పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబర్చాలని సూచించారు. చదువును ఎలాంటి పరిస్థితుల్లోనూ మధ్యలో నిలిపివేయవద్దని, ఉన్నత విద్యతో ఆర్థిక స్వావలంబన సాధించాలని ఆమె పిలుపునిచ్చారు.

## క్షయవ్యాధి నిర్మూలనకు సమష్టి
# కృషి చేయాలి

**-ఆశా కార్యకర్తలతో క్షయ వ్యాధి పై అవగాహన కల్పించాలి**

**-జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్**



**నాగర్ కర్నూల్ : జులై (ప్రజా జ్యోతి)** ప్రత్యేక క్యాంపులతో క్షయవ్యాధిగ్రస్తులను గుర్తించి సకాలంలో చికిత్స అందించాలని,క్షయవ్యాధి నిర్మూలనను అత్యంత ప్రాధాన్య అంశంగా తీసు కొని ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేసి జిల్లా ను క్షయవ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రతి గ్రామం,ప్రతి ఇంటికి వైద్య సేవలను చేరవేసి వ్యాధిని ప్రారంభదశలో గుర్తించి చికిత్స అందించా లని సూచించారు.శనివారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో నిర్వహించిన వైద్యశాఖ సమీక్ష సమావేశంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ కృష్ణ వివిధ మండలాల వైద్యాధికారులు,

## నిర్ణీత గడువులోపు నిర్మాణ
# పనులు పూర్తి చేయాలి

### యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్



# నిర్ణీత గడువులోపు నిర్మాణ పనులు పూర్తి చేయాలి

నారాయణపేట ప్రతినిధి జూలై 25 (ప్రజా జ్యోతి)
నారాయణపేట మండలంలోని లింగంపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన దారిలో రూ.200 కోట్ల వ్యయంతో కొనసాగుతున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను శనివారం జిల్లా కలెక్టర్ ప్రియాంక పరిశీలించారు. అగ్రిమెంట్ ప్రకారం 2027 జూన్ నాటికి ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని నియోజక వర్గానికి ఒకటి చొప్పున యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ను నిర్మింపచేయిస్తోందని, అందులో భాగంగానే నారాయణపేట నియోజక వర్గానికి సంబంధించిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ను ఇక్కడి లింగంపల్లి గ్రామ సమీపములో నిర్మించడం జరుగుతోందని తెలిపారు. స్కూల్ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని ఆమె అధికారులను ఆదేశించారు. స్కూల్ నిర్మాణంలో 4 అకాడమిక్ బ్లాక్‌లు, ఒక సీనియర్ డార్మిటరీ ,ఒక జూనియర్ డార్మిట్, ఒక వంటగది, భోజనశాల, ప్రధాన నివాస గృహం, రెండు సింగిల్ క్వార్టర్లు, 6 డబుల్ ఌ సంప్ లు, తల్లిదండ్రుల లాంచ్ ఉంటాయని టీజీ ఈ డబ్ల్యూ ఐ డీ సీ డీ.ఈ.ఈ వెంకట్ రెడ్డి మ్యాప్ ద్వారా కలెక్టర్ కు వివరించారు. పనుల్లో వేగం పెంచి అగ్రిమెంట్ ప్రకారం స్కూల్ నిర్మాణ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

## ఆధునిక పోలీసింగ్‌కు పటిష్ట వ్యవస్థే పునాది

ఆదేశించారు.కార్యాలయ రికార్డులను శాస్త్రీయంగా,క్రమబద్ధంగా నిర్వహించడంతో పాటు అన్ని పరికరాలు ఎల్లప్పుడూ వినియోగానికి సిద్ధంగా ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.ఆర్ఐ స్టోర్‌లో పోలీసు సిబ్బందికి అవసరమైన యూనిఫాంలు,బూట్లు,బెల్టులు,క్యాపులు,రెయిన్‌కోట్లు,బ్యాడ్జీలు,రక్షణ పరికరాలు తదితర సామగ్రి నాణ్యత,నిల్వ,పంపిణీ వ్యవస్థను పరిశీలించి,అవసరమైన సమయంలో ఎలాంటి ఆలస్యం లేకుండా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.బాంబ్ డిస్పోజల్ టీమ్ వద్ద బాంబ్ సూట్లు,మెటల్ డిటెక్టర్లు,బాంబ్ డిస్పోజల్ కిట్లు,కమ్యూనికేషన్ పరికరాలను పరిశీలించిన ఆయన, అత్యవసర పరిస్థితుల్లో బృందం అత్యంత అప్రమత్తంగా పనిచేయాల్సి ఉంటుందని, పరికరాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేసి సక్రమ స్థితిలో ఉంచాలని సూచించారు.మోటార్ ట్రాన్స్‌పోర్ట్ విభాగంలో పోలీసు వాహనాల నిర్వహణ,సర్వీసింగ్, ఇంధన వినియోగ రికార్డులు,లాగ్‌బుక్‌లను పరిశీలించిన ఎస్పీ,అత్యవసర పరిస్థితుల్లో ప్రతి వాహనం సిద్ధంగా ఉండేలా నిరంతర నిర్వహణ చేపట్టాలని ఆదేశించారు.ఆర్ఐ అడ్మిన్ కార్యాలయంలో సిబ్బంది హాజరు,ఆయుధాల నిర్వహణ,శిక్షణ,పరేడ్ నిర్వహణ,విధుల కేటాయింపును సమీక్షించి,క్రమశిక్షణ,సమయపాలన,ఆయుధాల సంరక్షణలో అత్యున్నత ప్రమాణాలు పాటించాలని సూచించారు.హోమ్ గార్డ్స్ కార్యాలయాన్ని సందర్శించిన ఎస్పీ,ట్రాఫిక్ నియంత్రణ,బందోబస్తు,శాంతిభద్రతల పరిరక్షణ,విపత్తుల సమయంలో హోమ్ గార్డ్స్ అందిస్తున్న సేవలను అభినందించారు.జిల్లా కంట్రోల్ రూమ్‌లో డయల్-100, పెట్రో కార్లు,నైట్ పెట్రోలింగ్,హైవే పెట్రోలింగ్,బ్లూ కోల్ట్స్,బీట్ సిబ్బంది కార్యకలాపాలను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజల నుంచి వచ్చే అత్యవసర ఫిర్యాదులపై వెంటనే స్పందించి సత్వర పోలీసు సేవలు అందించాలని సూచించారు.కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ప్రత్యక్ష దృశ్యాలను పరిశీలించిన ఎస్పీ,అనుమానాస్పద కదలికలను వెంటనే గుర్తించి సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని ఆదేశించారు.సీసీ కెమెరాల ద్వారా నేరాల నివారణ,ట్రాఫిక్ నియంత్రణ,శాంతిభద్రతల పరిరక్షణ మరింత సమర్థవంతంగా నిర్వహించవచ్చని తెలిపారు.ఎస్-మ్యాక్ రూమ్ పనితీరును సమీక్షించిన ఎస్పీ,ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించి నేరాల నియంత్రణ,ఇంటెలిజెన్స్ సేకరణ,నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని అధికారులకు సూచించారు.సాంకేతికతను సమర్థంగా వినియోగించడం ద్వారా ప్రజలకు మరింత వేగవంతమైన,సమర్థవంతమైన పోలీసు సేవలు అందించడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

## క్షయవ్యాధి నిర్మూలనకు సమష్టి కృషి చేయాలి

పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ
క్షయవ్యాధి నివారణకు ప్రభుత్వ మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయడంతో పాటు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని క్షయవ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించేందుకు ఆశా కార్యకర్తలు,ఏఎన్ఎంల సేవలను మరింత సమర్థవంతంగా వినియోగించాలని,ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు టీబీ వ్యాధి లక్షణాలు,నివారణ మార్గాలు,చికిత్స విధానం గురించి అవగాహన కల్పించి అవసరమైతే అక్కడికక్కడే శాంపిల్స్ సేకరించి పరీక్షలకు పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని,ఈ విధానం ద్వారా వ్యాధిని తొలిదశలోనే గుర్తించి బాధితులకు వెంటనే చికిత్స ప్రారంభించే అవకాశం ఉందని అన్నారు.జిల్లాలోని అన్ని మండలాల్లో ప్రత్యేక టీబీ నిర్ధారణ శిబిరాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని,ప్రతి క్యాంపులో అధిక సంఖ్యలో శాంపిల్స్ సేకరించి పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణలో జాప్యం జరగకుండా ప్రతి కేసును నిశితంగా పర్యవేక్షించాలని క్షయవ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహార సహాయం, ఉచిత మందులు,వైద్య పరీక్షలు,ఇతర సంక్షేమ పథకాలపై ప్రజలకు సమాచారం అందించాలని మండల వైద్యాధికారులను ఆదేశించారు.చికిత్స మధ్యలో ఎవరూ విరమించకుండా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని,రోగులు పూర్తిస్థాయి లో కోలుకునే వరకు వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు.ప్రతి మండలంలో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి,గ్రామ స్థాయిలో ఆశా కార్యకర్తలు,ఏఎన్ఎంలు,ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పనిచేస్తే జిల్లాను క్షయవ్యాధి రహిత జిల్లాగా మార్చే లక్ష్యాన్ని సాధించవచ్చని,ఇందుకు గ్రామస్థాయిలో విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో అపోహలను తొలగించాలని మరో పది రోజుల్లో హెచ్ఐవీ/ఎయిడ్స్ నియంత్రణ చర్యలపై కూడా ప్రత్యేక సమీక్ష నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.అనంతరం జిల్లా వైద్యాధికారి కృష్ణ మాట్లాడుతూరాష్ట్రీయ బాల్ స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) ద్వారా నిర్వహించే ఆరోగ్య పరీక్షల సమయంలో కూడా టీబీ లక్షణాలున్న వారిని గుర్తించి అవసర మైన స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించే అవకాశముందని,పిల్లలు,యువతపై ప్రత్యేక దృష్టి సారించడం ద్వారా కేసులను ప్రారంభ దశలోనే గుర్తించవచ్చని తెలిపారు.సమీక్షలో మండలాల వైద్యాధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## రాజాపూర్ కేజీబీవీలో నూతన కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

కుటుంబ సమస్యలు లేదా ఇతర ఇబ్బందులు ఎదురైతే ఉపాధ్యాయులతో పంచుకుని చదువును కొనసాగించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ రాజాపూర్ కేజీబీవీ అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థినుల భద్రత కోసం కాంపౌండ్ వాల్ నిర్మాణాన్ని త్వరలో పూర్తి చేయడంతో పాటు సీఎస్ఆర్ నిధుల ద్వారా మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లను వినోదానికి కాకుండా విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు వినియోగించాలని, ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఉన్నత లక్ష్యాలను సాధించేలా కష్టపడి చదవాలని విద్యార్థినులకు సూచించారు.

## ముగిసిన మండల స్థాయి వృత్యంతర శిక్షణా కార్యక్రమం

నారాయణపేట ప్రతినిధి జూలై 25 (ప్రజా జ్యోతి)
ప్రభుత్వ పాఠశాలల్లో బోధనలో నాణ్యతను విద్యార్థుల్లో ప్రమాణాలను పెంచుట కొరకు ఉద్దేశించిన మూడు రోజుల వృత్యంతర శిక్షణా కార్యక్రమం నారాయణపేట మండలం కేజీబీవీ పాఠశాల యందు ముగిసినది .
తెలుగు, ఆంగ్లము మరియు గణిత విషయాలలో తరగతి గదిలో బోధనను మెరుగుపరుచుకొనుటకు, అలాగే చదువులో వెనకబడిన విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంచుట కొరకు మండల స్థాయి ప్రత్యేక వృత్యంతర శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమంలో ఏఐని ఉపయోగించి ఏ ఎక్స్ ఎల్ కార్యక్రమం అమలు గురించి, చదువులో వెనకబడిన విద్యార్థులను మెరుగుపరచుటకు ప్రతిరోజు ఒక గంట రెమిడీయేషన్ పీరియడ్ నిర్వహించడం గురించి, ప్రాథమిక దశలో మౌలిక భాష ,గణిత సామర్థ్యాలను పెంపొందించే విధంగా ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడం జరిగింది. శిక్షణ కార్యక్రమాన్ని మండల విద్యాశాఖ అధికారి మరియు కోర్స్ డైరెక్టర్ శ్రీ బాలాజీ గారు పర్యవేక్షణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఈ విద్యాసంవత్సరం రాష్ట్రవ్యాప్తంగా ఒక లక్ష మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల నుండి ప్రభుత్వ పాఠశాలల్లో చేరారని మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఉపాధ్యాయులు కూడా తమ వృత్తి నైపుణ్యాలను పెంచుకోవాలని, బోధనలో నాణ్యతను పెంచుకోవాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమం ను జిల్లా రిసోర్సు పర్సన్ లక్ష్మీ భీమప్ప గారు, శ్రీ విశ్వనాథ్ రెడ్డి గారు, మండల రిసోర్స్ పర్సన్లు శ్రీ సత్యనారాయణ గారు, రఘువీర్ గారు, బాలకృష్ణ గారు, సాయిలు గారు, ఐశ్వర్య గారు,చిన్న నరసింహులు గారు, లాలప్ప గారు,మరియుశంకర్ సింగ్ గార్లు ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు.

**జిల్లాస్థాయి తెలుగు మరియు ఎల్ ఎఫ్ ఎల్ హెచ్ ఎం ఉపాధ్యాయ శిక్షణ ముగింపు**

95 మంది ఎఫ్ లు హెచ్ ఎం లు ఉపాధ్యాయులు మరియు 68 మంది తెలుగు ఉపాధ్యాయులు మొత్తం 163 మంది పాల్గొని శిక్షణ ముగింపు జరగడం జరిగింది ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి తెలుగు సబ్జెక్టుకు సంబంధించిన డీఆర్పీలు టి శ్రీనివాస్ ఎల్ వీరేందర్ గౌడ్ జి భాస్కర్ సోమనాథ్ మరియు ఎల్ ఎఫ్ ఎల్ హెచ్ ఎం డి ఆర్ పి లు దండు శేఖర్ తిమ్మన్న వేణుగోపాల్ వెంకటేష్ పాల్గొన్నారు



## జలసిరిని ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దాలి:మంత్రి సీతక్క

గద్వాల జూలై 25(ప్రజా జ్యోతి ప్రతినిధి):జలసిరి,వీబీజీ--రామ్,వన మహోత్సవం వంటి కార్యక్రమాలను ప్రజల భాగస్వామ్యంతో ఉద్యమంలా అమలు చేసి గ్రామీణాభివృద్ధిని వేగవంతం చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అధికారులకు సూచించారు.శనివారం హైదరాబాద్ నుంచి మంత్రి సీతక్క,సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్,ఉన్నతాధికారులతో కలిసి జలసిరి, వీబీజీ--రామ్,వన మహోత్సవం,15వ,ఆర్థిక సంఘం నిధులు,గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళికలపై జిల్లా అదనపు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ,ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించి జలసిరి కార్యక్రమం ప్రాధాన్యత,నీటి సంరక్షణ అవసరం,వర్షపు నీటిని ఒడిసిపట్టడం వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన



కల్పించాలని సూచించారు.ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు,ప్రతి గ్రామానికి ఊటకుంటలు,ప్రతి పంటకు నీటి కుంటలు నిర్మించి వర్షపు నీటిని నిల్వ చేయడం ద్వారా భూగర్భ జలాలను పెంపొందించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఆగస్టు 15లోగా జిల్లాలో లక్ష ఇంకుడు గుంతల నిర్మాణం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించిన మంత్రి,అధికారులు,ప్రజలు సమన్వయంతో పనిచేసి జల సంరక్షణను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామీణ కుటుంబాలకు ఉపాధి హామీ పథకం కింద విస్తృతంగా పనులు కల్పించాలని సూచించారు.12 కోట్ల పనిదినాల లక్ష్య సాధనకు సమష్టిగా కృషి చేయాలని,ప్రతి గ్రామ పంచాయతీలో రోజుకు సుమారు 60 మంది కూలీలకు ఉపాధి కల్పించేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. సర్పంచ్,పంచాయతీ కార్యదర్శి,ఫీల్డ్ అసిస్టెంట్‌లతో కమిటీ ఏర్పాటు చేసి ఉపాధి పనులను విస్తరించాలని ఆదేశించారు.వన మహోత్సవం సందర్భంగా జిల్లాలో ప్రజల భాగస్వామ్యంతో భారీ ఎత్తున మొక్కలు నాటాలని,నిర్మాణంలో ఉన్న గ్రామ పంచాయతీ భవనాలు,విలేజ్ ఆర్గనైజేషన్ భవనాల పనులను వేగంగా పూర్తి చేయాలని మంత్రి సూచించారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు మాట్లాడుతూ,జలసిరి,వీబీజీ--రామ్,వన మహోత్సవం కార్యక్రమాల లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించి ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు,గ్రామీణ కుటుంబాలకు ఉపాధి హామీ పథకం కింద విస్తృతంగా పనిదినాలు కల్పించాలని సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ముషాయిదా బేగం,డీపీఓ శ్రీకాంత్, పంచాయతీరాజ్ ఈఈ ప్రభాకర్,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వారం రోజుల ట్రాఫిక్ తనిఖీలు: 519 - ఎంవీ యాక్ట్ కేసులు నమోదు

**మహబూబ్‌నగర్, జూలై 25 (ప్రజా జ్యోతి బ్యూరో):**

మహబూబ్‌నగర్ జిల్లాలో ట్రాఫిక్ నిబంధనల అమలుపై పోలీసులు చేపట్టిన వారం రోజుల ప్రత్యేక తనిఖీల్లో భారీగా మోటారు వాహనాల చట్టం (ఎంవీ యాక్ట్) కింద కేసులు నమోదయ్యాయి. జిల్లా ఎస్పీ దరావత్ జానకి ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో జూలై 19 నుంచి 25 వరకు నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో మొత్తం 519 కేసులు నమోదు చేసి రూ.4,09,000 జరిమానాలు విధించారు. తనిఖీల్లో హెల్మెట్ ధరించని 185 మంది, ట్రిపుల్ రైడింగ్ చేసిన 130 మంది, డ్రైవింగ్ చేస్తూ మొబైల్ ఫోన్ వినియోగించిన 61 మంది, రాంగ్ రూట్‌లో ప్రయాణించిన 50 మంది, సీట్ బెల్ట్ ధరించని 44 మంది, డ్రంక్ అండ్ డ్రైవ్‌కు పాల్పడిన 29 మంది, మైనర్ డ్రైవింగ్‌కు సంబంధించిన 11 కేసులు, సైలెన్సర్ మార్పు/సౌండ్ పొల్యూషన్‌కు 9 కేసులు నమోదు చేశారు. అలాగే ట్రాఫిక్ నియమాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఆరు ప్రత్యేక అవగాహన, కౌన్సెలింగ్ కార్యక్రమాలు నిర్వహించి రోడ్డు భద్రతపై సూచనలు అందించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్,



నాలుగు చక్రాల వాహనదారులు సీట్ బెల్ట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ ఉపయోగించరాదని, రాంగ్ రూట్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్ వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ట్రాఫిక్ నియమాలు ప్రతి ఒక్కరి భద్రత కోసమేనని, బాధ్యతాయుతంగా వ్యవహరించి సురక్షిత ప్రయాణానికి సహకరించాలని పిలుపునిచ్చారు.

# వెన్నచేడ్‌ను సౌర విద్యుత్ ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలి

## : కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్, జూలై 25 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

రాష్ట్ర ప్రభుత్వం క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ కింద ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'సోలార్ మోడల్ విలేజ్' కార్యక్రమంలో భాగంగా గండీడ్ మండలం వెన్నచేడ్ గ్రామంలో గృహాలు, వ్యవసాయ పంపుసెట్లకు సోలార్ విద్యుత్ వ్యవస్థల ఏర్పాటును వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లో విద్యుత్ శాఖ, టీజీ రెడ్కో అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె ప్రాజెక్టు పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న 'తెలంగాణ మోడల్ సోలార్ గ్రామాల' కార్యక్రమం కింద రాష్ట్రవ్యాప్తంగా 81 గ్రామాలను ఎంపిక చేయగా, మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలంలోని వెన్నచేడ్ గ్రామం కూడా ఎంపికైనట్లు తెలిపారు.

అర్హత కలిగిన ప్రతి ఇంటికి 2 కిలోవాట్ల రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలను, ఆసక్తి ఉన్న రైతులకు సోలార్ పంపుసెట్లను ఉచితంగా ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. గ్రామంలో మొత్తం 726 గృహ విద్యుత్ కనెక్షన్లు ఉండగా, వాటిలో 261 గృహాలు రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు అనువుగా ఉన్నాయని అధికారులు తెలిపారు. వీటిలో ఇప్పటివరకు 116 గృహాల్లో 2 కిలోవాట్ల రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటు పూర్తయింది. అదేవిధంగా గ్రామంలో మొత్తం




447 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉండగా, ఇప్పటివరకు 64 మంది రైతులకు 7.5 హెచ్‌పీ సామర్థ్యం గల సోలార్ పంపుసెట్లు అమర్చినట్లు అధికారులు కలెక్టర్‌కు నివేదించారు. మిగిలిన పనులను కూడా ఎలాంటి ఆలస్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేసి వెన్నచేడ్‌ను రాష్ట్రానికి ఆదర్శ సోలార్ గ్రామంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో రెడ్కో జిల్లా మేనేజర్ కె. మనోహర్ రెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ భాస్కర్, టీజీఎస్పీడీసీఎల్ ఎస్ఈ భీమా నాయక్, విద్యుత్ శాఖ డీఈ లక్మన్ నాయక్, ఏడీఈ సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో జంతర్ మంతర్ ధర్నాలో పాల్గొన్న సంధ్యపోగు అభిలాష్

## నీట్ విద్యార్థులకు సంఘీభావం

**మహబూబ్‌నగర్, జూలై 25 (ప్రజా జ్యోతి బ్యూరో):**




మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి చెందిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్. వినోద్ కుమార్ కుమారుడు సంధ్యపోగు అభిలాష్ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన ధర్నాలో పాల్గొని నీట్ విద్యార్థులకు సంఘీభావం తెలిపారు.

ఈ సందర్భంగా పార్లమెంటరీ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీతో పాటు ఇతర ప్రతిపక్ష నాయకుల అరెస్టులను ఖండించారు. అలాగే, నీట్ పేపర్ లీక్ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న అంశాల్లో పారదర్శకత, న్యాయం పాటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

# మల్దకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నేమ్‌బోర్డు విరాళం అందించిన పూర్వ విద్యార్థి

**మల్దకల్ జూలై 25(ప్రజా జ్యోతి):**




మల్దకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2006--08 విద్యా సంవత్సరంలో బైపీసీ విభాగంలో చదివిన పూర్వ విద్యార్థి,ప్రస్తుతం అరగిద్ద గ్రామ సర్పంచ్‌గా సేవలందిస్తున్న బాలకృష్ణ కళాశాలకు పెయింటింగ్‌తో కూడిన నేమ్‌బోర్డును విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత,బాలకృష్ణను శాలువాతో ఘనంగా సత్కరించి,కళాశాల అభివృద్ధికి అందించిన సహకారానికి కళాశాల తరఫున అధ్యాపకులు,అధ్యాపకేతర సిబ్బంది తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తన మాతృ విద్యాసంస్థ పట్ల బాలకృష్ణ చూపిన అభిమానం,సేవాభావం ఇతర పూర్వ విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ పూర్వ విద్యార్థుల నుంచి ఇలాంటి సహకారం కొనసాగి కళాశాల అభివృద్ధికి తోడ్పడాలని ఆమె ఆకాంక్షించారు.

# ఆరుతడి పంటలు సాగు చేయాలి

## సర్పంచ్ జ్యోతి

**వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్**

ఆరుతడి పంటలను రైతులు సాగు చేయాలని గోవర్ధనగిరి గ్రామ సర్పంచ్ ముంత జ్యోతి బిచ్చన్న యాదవ్ ఏ ఈ ఓ నరేష్ అన్నారు. మండల పరిధిలోని గోవర్ధనగిరి గ్రామంలో ఎల్ నిఓ ప్రభావం పై రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా గోవర్ధనగిరి గ్రామ సర్పంచ్ ముంత జ్యోతి బిచ్చన్న యాదవ్ ఏ ఈ ఓ నరేష్ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల వల్ల వరి సాగును తగ్గించి , రైతులు ఆరుతడి పంటలు కంది, మినుములు, పెసర, సజ్జలు, కొర్రలు ,జొన్న, రాగులు ,పామాయిల్ సాగు సాగు చేయాలని సూచించారు. నీటి వసతి రైతులు మాత్రమే వరి సాగు చేసుకోవాలని సూచించారు, నీటి కొరత ఉన్న చోట ఆరుతడి పంటలు సాగు చేసిన రైతులకు ప్రభుత్వం రాయితీలు అందిస్తుందన్నారు. చిరుధాన్యాలు, తృణధాన్యాలు పంటలను ప్రత్యమ్యంగా సాగు చేయడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ ఉప సర్పంచ్ ఈశ్వరమ్మ , వార్డు మెంబర్లు నారాయణ,బి,వెంకటస్వామి, రాజేందర్ గౌడ్, లక్ష్మి గ్రామస్తులు ఎస్ వెంకట స్వామి, పడిగన్న, రాజశేఖర్ రెడ్డి, సంజీవరెడ్డి, గట్టు నారాయణ , దర్గేష్, రాజు, కృష్ణయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ బాలక్రిష్ణ గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# కొలిచిన వారికి కొంగుబంగారం.. కొండలయ్య స్వామి

- కొండలయ్య క్షేత్రంలో భక్తుల ఏకాదశి భక్తి వైభవం
- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీ వైస్‌చైర్మన్ వాకిటి శ్రీధర్

**వనపర్తి, జూలై 25 (ప్రజాజ్యోతి):**

పెద్దమందడి మండలం జగత్‌పల్లి కొండలయ్య గుట్టపై స్వయంభువుగా వెలసిన శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయానికి ఏకాదశి పర్వదినం సందర్భంగా శనివారం భక్తులు భారీగా తరలివచ్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. మాజీ వనపర్తి మునిసిపల్ వైస్‌చైర్మన్ వాకిటి శ్రీధర్ తన అనుచరులతో కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుపతి వెళ్లలేని వారు కొండలయ్య స్వామిని దర్శించుకున్నా సకల పుణ్యఫలాలు లభిస్తాయని భక్తుల విశ్వాసమన్నారు. వనపర్తికి సమీపంలో ఉన్న ఈ క్షేత్రంలో శ్రావణమాసాన్ని పురస్కరించుకుని భక్తులకు సౌకర్యాలు కల్పించేలా అభివృద్ధి పనులు చేపడుతున్న శ్రీ విశ్వకర్మ గాయత్రి ట్రస్టు నిర్వాహకులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సుగూరు శ్రీనివాసులు, బండారు శ్రీనివాసులు, విష్ణుచారి, యాదయ్య వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.



# మౌలిక వసతులు కల్పించాలి

మల్దకల్ జూలై 25(ప్రజా జ్యోతి) మల్దకల్ మండలంలోని ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతలు,తాగునీరు,బాత్రూమ్‌లు,మరుగుదొడ్లు తదితర సదుపాయాలను తక్షణమే కల్పించాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మండల విద్యాశాఖ అధికారి (ఎంఈవో)కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ మల్దకల్ మండల అధ్యక్షుడు ప్రభు వరుణ్ మాట్లాడుతూ,మండలంలోని ఎలైట్ గ్రామర్ ప్రైవేట్ స్కూల్లో విద్యార్థులకు కనీస మౌలిక వసతులు కూడా అందుబాటులో లేవని ఆరోపించారు. ముఖ్యంగా సరైన బాత్రూమ్‌లు,మరుగుదొడ్లు,పరిశుభ్రత,తాగునీటి సౌకర్యం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అనేక సంవత్సరాలుగా పాఠశాల యాజమాన్యం ఈ సమస్యలను పరిష్కరించకుండా విద్యాసంస్థను నిర్వహించడం బాధాకరమని పేర్కొన్నారు. సంబంధిత విద్యాశాఖ అధికారులు వెంటనే పాఠశాలపై సమగ్ర విచారణ చేపట్టి,నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నట్లు తేలితే గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే మల్దకల్ మండలంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో మౌలిక వసతులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి,తాగునీరు,బాత్రూమ్‌లు, మరుగుదొడ్లు,పరిశుభ్రత వంటి కనీస సౌకర్యాలు లేని పాఠశాలలపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే వాటి గుర్తింపులను రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో



పీడీఎస్‌యూ మండల కార్యదర్శి రాజు,చందు తదితరులు పాల్గొన్నారు.

# నల్సా పథకాలపై,చిన్నారుల రక్షణపై విద్యార్థులకు అవగాహన

**గద్వాల జూలై 25(ప్రజా జ్యోతి ప్రతినిధి):**
జాతీయ న్యాయ సేవా సంస్థ (నల్సా) అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు చిన్నారులపై నేరాల నివారణ,బాలల హక్కులు,పోక్సో చట్టం,బాల్య వివాహాల నిర్మూలన,బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన,సైబర్ నేరాల నివారణ తదితర అంశాలపై జిల్లా న్యాయ సేవా సంస్థ (డీఎల్ఎస్ఏ),జోగులాంబ గద్వాల ఆధ్వర్యంలో మూడు విద్యాసంస్థల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు.మొదటగా గద్వాల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ వి.రాజేందర్ ముఖ్య అతిథిగా పాల్గొని నల్సా పథకాల ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉంటుందని తెలిపారు.చిన్నారులపై జరిగే నేరాలను అరికట్టడంలో విద్యార్థులు,ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అలాగే బాలల హక్కులు,పోక్సో చట్టం,సైబర్ భద్రత, చట్టపరమైన రక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి.కృష్ణ,డీసీపీవో నరసింహులు,చైల్డ్‌లైన్, భరోసా కేంద్రం,సఖి కేంద్రం ప్రతినిధులు,అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.అదే రోజు గట్టు మండలంలోని రెసిడెన్షియల్ స్కూల్,మాచర్ల గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కూడా ఇదే అంశాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమాల్లో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్స్ బి.శ్రీనివాసులు,బి.లక్ష్మణస్వామి మాట్లాడుతూ,నల్సా పథకాల ద్వారా ఉచిత న్యాయ సేవలు పొందే విధానం,మహిళలు,పిల్లలు,ఎస్సీ,ఎస్టీ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు అందుబాటులో ఉన్న న్యాయ సహాయంపై వివరించారు.అలాగే పోక్సో చట్టం,బాల్య వివాహాల నిషేధం,బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన,సైబర్ నేరాల నివారణ,అత్యవసర పరిస్థితుల్లో 1098 చైల్డ్ హెల్ప్‌లైన్



సేవలను వినియోగించుకోవాల్సిన అవసరాన్ని వివరించారు.జిల్లా సంక్షేమ అధికారి సునంద బాలల సంక్షేమం,ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు,విద్యార్థుల భద్రత, హక్కుల పరిరక్షణపై అవగాహన కల్పించారు.గట్టు కార్యక్రమంలో రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ శోభారాణి,సర్పంచ్ నాగరాజు,డీసీపీవో నరసింహులు,చైల్డ్‌లైన్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.మాచర్లలో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.వెంకటేశ్వర్లు,సర్పంచ్ వజ్రమ్మ,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ, నల్సా పథకాల ద్వారా సమాజంలోని బలహీన వర్గాలకు ఉచిత న్యాయ సేవలు అందించడం, మహిళలు, చిన్నారుల హక్కులను పరిరక్షించడం, గ్రామీణ ప్రాంతాల్లో న్యాయ అవగాహన పెంపొందించడం సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. విద్యార్థులు తమ హక్కులు, చట్టాలపై అవగాహన పెంపొందించుకొని సమాజంలో నేరాల నివారణకు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# ఇద్దరు పిల్లలు ఓ వ్యక్తి ప్రాణాలను కాపాడిన సిద్ధాపూర్ పోలీసులు

**-అచ్చంపేట సీఐ నాగరాజుతో ప్రత్యేక బృందం ఏర్పాటు**

**-అభినందించిన ఎస్పీ సంగ్రామ్ సింగ్ పాటిల్**

**నాగర్ కర్నూల్ : జులై 25 (ప్రజా జ్యోతి)**
సమయస్ఫూర్తితో స్పందించి ఓ వ్యక్తి తో పాటు ఇద్దరు పిల్లల ప్రాణాలను పోలీసులు కాపాడిన సంఘటన సిద్ధాపూర్ పోలీస్ స్టేటస్ పరిధిలో చోటు చేసుకుంది. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి.కుటుంబ కలహాల నేపథ్యంలో తీవ్ర మనస్తాపానికి గురై,తన ఇద్దరు చిన్న పిల్లలతో సహా ఆత్మహత్య చేసుకుంటానని చెప్పి వెళ్లిపోయన వ్యక్తిని సిద్ధాపూర్ పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి 3 గంటల్లో సురక్షితంగా రక్షించారు.అచ్చంపేట మండలం,ఎద్దుమిట్ట తండా గ్రామానికి చెందిన రామావత్ నాగరాజు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు.కొన్ని రోజులుగా కుటుంబ విషయమై భార్యతో వివాదాలు జరుగుతున్నాయి ఈ క్రమంలో శనివారం ఉదయం 10:00 గంటల సమయంలో నాగరాజు తీవ్ర ఆవేదనతో ఇద్దరు పిల్లలను తీసుకొని నేను చనిపోతున్నాను అని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లి పోగా సమాచారం తెలిసిన సిద్ధాపూర్ పోలీస్ స్టేటస్ సిబ్బంది సిఐ నాగరాజు పర్యవేక్షణలో ప్రత్యేక బృందం రంగంలోదిగింది.కానిస్టేబుళ్లు సహదేవ్,మాల్యా,హరి,అనిల్ లతో కూడిన బృందం



అత్యాధునిక సాంకతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి బాధితుడి మొబైల్ లొకేషన్ ఆధారంగా గాలింపు చేపట్టి సుమారు 3 గంటల పాటు నిరంతరం శ్రమించి,నాగరాజు అతని ఇద్దరు పిల్లలు ఉన్న ప్రాంతాన్ని గుర్తించి వారిని ప్రాణాపాయ స్థితి నుండి సురక్షితంగా రక్షించి కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించిన అనంతరం బాధితుడికి,కుటుంబ సభ్యులకు అవసరమైన కౌన్సెలింగ్ నిర్వహించి,భవిష్యత్తులో ఇలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దన్నారు.సమయస్ఫూర్తితో వ్యవహరించి ముగ్గురి ప్రాణాలను కాపాడిన సిద్ధాపూర్ పోలీస్ అధికారులను,సిబ్బందిని జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ అభినందించారు.

# రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కారానికి అభినందనా

**– జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు**

**నారాయణపేట ప్రతినిధి జూలై 25 (ప్రజా జ్యోతి)**
నారాయణపేట జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జరిగిన కోఆర్డినేషన్ మీటింగ్‌లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు గారు మాట్లాడుతూ..రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించడానికి లోక్ అదాలత్ ఎంతో ఉపయోగపడుతుందని న్యాయమూర్తి తెలిపారు. సెప్టెంబర్ లో జరిగే 3వ జాతీయ లోక్ అదాలత్ ను విజయవంతం చేయడానికి అన్ని టీములు సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు, ఈ జాతీయ లోక్ అదాలత్ ను కక్షిదారులు ఉపయోగించుకునేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. జూన్ 20న జరిగిన జాతీయ లోక్ అదాలత్ లో రాజీమార్గం ద్వారా మొత్తం 5300 కేసులు డిస్పోజల్ చేసి నారాయణపేట జిల్లా రాష్ట్రంలో 18వ ర్యాంక్ సాధించినట్లు పేర్కొన్నారు. ఈ విజయానికి కృషి చేసిన, న్యాయమూర్తులను మరియు పోలీస్ అధికారులని అభినందించారు. తదుపరి సెప్టెంబర్ 12వ లోక్ అదాలత్ లో క్రిమినల్ కాంపౌండబుల్ కేసులు, సివిల్ కేసులు, ఎన్ఐ యాక్ట్, ఈపీ కేసులు, సైబర్ క్రైమ్స్, ఎన్ బి డబ్ల్యూ కేసులను డిస్పోజల్ చేయాలని, ముఖ్యంగా జైలులో ఉన్న ఖైదీల కేసులకు ప్రాధాన్యత ఇవ్వాలని పోలీస్ అధికారులకు ఆదేశించారు. తదుపరి డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను యధావిధిగా కొనసాగించాలని సూచించారు. తదుపరి భరోసా, సఖి సెంటర్ సిబ్బంది తో






మాట్లాడుతూ జూశీఎంశీ కేసుల మండెటోరీ రిపోర్ట్స్, ఐడెంటిటీ ప్రొటెక్షన్ మరియు ఫాస్ట్ ట్రయల్స్ గురించి ఆరాదించారు. ఈ సమావేశంలో డి.ఎల్.ఎస్.ఏ సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి బి. సాయి మనోజ్, జూనియర్ సివిల్ జడ్జి సుస్మిత, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి అవినాష్, డీఎస్పీ లింగయ్య, డిఈఈ రాములు, పోలీస్ సిబ్బంది, భరోసా, సఖి సెంటర్ సిబ్బంది, ఎషఎ మెంబెర్ రాధా మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఎన్యుమరేషన్ ఫారాలు వెంటనే పూరించి బీఎల్‌వోలకు అందజేయాలి

**గద్వాల జూలై 25(ప్రజా జ్యోతి):**
ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి పంపిణీ చేసిన ఎన్యుమరేషన్ ఫారాలను ఓటర్లు తప్పనిసరిగా పూరించి సంబంధిత బీఎల్‌వోలకు తిరిగి అందజేయాలని గద్వాల తహసీల్దార్ హరికృష్ణ కోరారు.శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ,గద్వాల మండల పరిధిలో ప్రస్తుతం 75 శాతం కంటే తక్కువ డిజిటలైజేషన్ నమోదైన 43 పోలింగ్ కేంద్రాలపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక దృష్టి సారించి,వంద శాతం డిజిటలైజేషన్ లక్ష్యంతో అధికారులు పనిచేస్తున్నట్లు తెలిపారు.రాధాకృష్ణ కాలనీ,వీవర్స్ కాలనీ,భీమ్‌నగర్,రెవెన్యూ కాలనీ, సుంకులమ్మమెట్టు,నల్లకుంట,రాజీవ్ మార్గ్,గంజిపేట,కుంట వీధి,వేణు కాలనీ,రెండో రైల్వే గేట్, బురదపేట,షేరెల్లి వీధి,అశోక్‌నగర్,రాతిబురుజు,సోమనాద్రి నగర్,శ్రీనివాస కాలనీ,చింతలపేట,భవానీ నగర్,తూర్పు దౌదర్‌పల్లి,తెలుగుపేట,బీసీ కాలనీ, లింగంబావి కాలనీ,చిన్న అగ్రహారం,మద్రాస్‌పేట,పూడూరు ఎస్సీ కాలనీ,అంబేద్కర్ నగర్,ఎర్రమట్టి వీధి తదితర ప్రాంతాల పోలింగ్ కేంద్రాల్లో డిజిటలైజేషన్ పురోగతి తక్కువగా ఉందన్నారు.ఈ పోలింగ్ కేంద్రాల పరిధిలో బీఎల్‌వోలు ఇంటింటి సర్వేను మరింత ముమ్మరం చేస్తున్నారని,ప్రజలు వారికి పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. లక్ష్యానికి వెనుకబడిన పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టి గణనీయమైన పురోగతి సాధించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.ప్రజలు తమకు అందిన ఎన్యుమరేషన్ ఫారాలను ఆలస్యం చేయకుండా పూర్తిగా పూరించి సంబంధిత బీఎల్‌వోలకు అందజేసి,ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో భాగస్వాములు కావాలని తహసీల్దార్ హరికృష్ణ పిలుపునిచ్చారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై కాంగ్రెస్ హర్షం



**గద్వాల జూలై 25(ప్రజా జ్యోతి):**
కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై జిల్లా కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.ఈ విజయం దేశ యువత సాధించిన విజయమని పేర్కొంటూ,ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. శనివారం జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ,విద్యార్థులు,యువత చేపట్టిన ఉద్యమాలకు కేంద్ర ప్రభుత్వం స్పందించాల్సి వచ్చిందన్నారు.ఈ పరిణామం భారతీయ జనతా పార్టీకి ఒక గుణపాఠమని,ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం మరింత బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో పాటు తమ ఇతర డిమాండ్లు కూడా నెరవేరే వరకు ఉద్యమాలు కొనసాగిస్తామని తెలిపారు.విద్యార్థుల మృతికి సంతాపం తెలిపేందుకు, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ ఆదివారం సాయంత్రం జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.యువత పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో డీసీసీ జిల్లా జనరల్ సెక్రటరీ శెట్టి ఆత్మకూరు లక్ష్మణ్,జిల్లా కార్యదర్శి మధు నాయుడు,జిల్లా జనరల్ సెక్రటరీ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి

గద్వాల జూలై 25(ప్రజా జ్యోతి ప్రతినిధి):గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ నిషేధిత చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డా. సంధ్యాకిరణ్ అన్నారు.గద్వాల పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రులను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి,క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ (సి ఈ ఏ),పి సి పి ఎన్ డి టి చట్టాల నిబంధనల అమలుపై క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆడ శిశువు రక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు.గర్భస్థ శిశువు లింగ నిర్ధారణకు పాల్పడే స్కానింగ్ కేంద్రాలు,వైద్యులు,సంబంధిత వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మార్గదర్శకాల ప్రకారం ఎఫ్-ఫారాలను క్రమం తప్పకుండా సమర్పించాలని ఆదేశించారు.ఈ తనిఖీల్లో డీఎంహెచ్ఓ వెంట ప్రోగ్రాం అధికారి డా.ప్రసూన రాణి,ఎస్‌వో తిరుమల్ రెడ్డి,నరసయ్య తదితరులు పాల్గొన్నారు.



# మిషన్ ఇండియా 2047" జాతీయ సదస్సుకు పాలమూరు విశ్వవిద్యాలయం వేదిక

**- ఆగస్టు 7, 8న రంగారెడ్డి జిల్లా కణ్వా శాంతివనంలో జాతీయ సదస్సు**

**-- దేశవ్యాప్తంగా ప్రముఖ విద్యావేత్తలు, శాస్త్రవేత్తల రాక**



**మహబూబ్‌నగర్, జూలై 25 (ప్రజా జ్యోతి బ్యూరో ):**

పాలమూరు విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఆగస్టు 7, 8 తేదీలలో కణ్వా శాంతివనంలో నిర్వహించనున్న ప్రతిష్ఠాత్మక "మిషన్ ఇండియా ఏ2047" జాతీయ సదస్సు ఏర్పాట్లపై శనివారం విశ్వవిద్యాలయ పరిపాలన భవనంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపకులపతి ప్రొఫెసర్ జి.ఎన్. శ్రీనివాస్ మాట్లాడుతూ, దేశంలోని అనేక విశ్వవిద్యాలయాలు పోటీపడినప్పటికీ ఈ జాతీయ సదస్సు నిర్వహణ బాధ్యత పాలమూరు విశ్వవిద్యాలయానికి దక్కడం గర్వకారణమని అన్నారు. వికసిత్ భారత్--2047 లక్ష్యాల సాధనకు అవసరమైన విధానాలు, పరిశోధనలు, ఆవిష్కరణలు, అభివృద్ధి దిశగా ఈ సదస్సు కీలక వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ సదస్సులో పీఎం ఉష పథకానికి చెందిన విశ్వవిద్యాలయాల ఉపకులపతులు, ప్రముఖ విద్యావేత్తలు, శాస్త్రవేత్తలు, పరిశోధకులు, పారిశ్రామిక రంగ నిపుణులు, కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వ ప్రజాప్రతినిధులు, విధాన రూపకర్తలు పాల్గొని తమ అనుభవాలను పంచుకోనున్నట్లు తెలిపారు. ఉన్నత విద్య, పరిశోధన, ఆవిష్కరణలు, కృత్రిమ మేధస్సు, సాంకేతిక అభివృద్ధి, పరిశ్రమ--విశ్వవిద్యాలయ భాగస్వామ్యం, నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్‌లు, ఉపాధి అవకాశాలు, పర్యావరణ పరిరక్షణ, స్థిరమైన అభివృద్ధి, జాతీయ పురోగతిలో విశ్వవిద్యాలయాల పాత్ర వంటి కీలక అంశాలపై సమగ్ర చర్చలు జరుగనున్నాయని వెల్లడించారు. అలాగే పరిశోధన నిధుల సమీకరణ, ప్రాజెక్టుల రూపకల్పన, పరిశ్రమ--విశ్వవిద్యాలయ అనుసంధానంపై నిపుణులు విలువైన సూచనలు అందిస్తారని చెప్పారు.

ఈ సదస్సు ద్వారా విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులు దేశంలోని ప్రముఖ శాస్త్రవేత్తలు, నిపుణులతో ప్రత్యక్షంగా మమేకమై తమ పరిశోధనా దృక్పథాన్ని మరింత విస్తరించుకునే అవకాశం లభిస్తుందని ఉపకులపతి పేర్కొన్నారు.

పాలమూరు విశ్వవిద్యాలయ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వివిధ పరిశ్రమలు, జాతీయ స్థాయి సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుని ఇంటర్న్‌షిప్‌లు, పరిశోధన ప్రాజెక్టులు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, స్టార్టప్‌లు, మెరుగైన ఉపాధి అవకాశాల కల్పనకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

ఈ జాతీయ సదస్సు పాలమూరు విశ్వవిద్యాలయానికి జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు తీసుకురావడంతో పాటు తెలంగాణలో ఉన్నత విద్య, పరిశోధన, ఆవిష్కరణలకు కొత్త దిశానిర్దేశం చేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు, పరిశ్రమల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మీడియా సమావేశంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి. రమేష్ బాబు, ఓఎస్‌డీ టు వైస్-చాన్సలర్ ప్రొఫెసర్ డి. మధుసూదన్ రెడ్డి, జాతీయ సదస్సు కన్వీనర్ డా. కె. ప్రవీణ్, కమిటీ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ ఎం. నూర్జహాన్, అకాడమిక్ కోఆర్డినేటర్ డా. శేకుంటి రవికుమార్, ప్రజాసంబంధాల అధికారి డా. ఎం. గాలెన్న తదితరులు పాల్గొన్నారు.

# ఆగష్టు 6న జరిగే బీసీ సాధికారత సదస్సును విజయవంతం చేయాలి

**- తెలంగాణ రక్షణ సేన నాయకుల పిలుపు**



**నారాయణపేట ప్రతినిధి జూలై 25 (ప్రజా జ్యోతి)**

నారాయణపేట జిల్లా కేంద్రంలోని టిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆగష్టు 6న ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా నిర్వహించనున్న బీసీ సాధికారత సదస్సును విజయవంతం చేయాలని తెలంగాణ రక్షణ సేన నారాయణపేట నియోజకవర్గ ఇంచార్జి గవినోళ్ల శ్రీనివాస్ జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అదే విధంగా మక్తల్ నియోజకవర్గ టిఆర్ఎస్ ఇంచార్జి డి.కె.సి.హెచ్. వెంకటన్న మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా ఉన్న బీసీ సోదర సోదరీమణులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ఈ సదస్సుకు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, టిఆర్ఎస్ ప్రకటించిన "పంచ జన్యం"లో భాగంగా ఉచిత విద్య, ఉచిత వైద్యం, రైతే రాజు, ఉద్యోగాల కల్పన, ఉపాధి అవకాశాల విస్తరణ, మహిళా సాధికారతతో పాటు సామాజిక న్యాయం అత్యంత కీలకమైన అంశమని పేర్కొన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని "సామాజిక న్యాయ సాధన దినోత్సవం"గా నిర్వహించాలని టిఆర్ఎస్ అధినేత్రి కవిత అక్క నిర్ణయించిన నేపథ్యంలో, నారాయణపేట జిల్లా ప్రజలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా మహిళా నాయకురాలు సంధ్యారాణి మాట్లాడుతూ, తెలంగాణలో సామాజిక న్యాయం సాధించాలంటే కవిత అక్క నాయకత్వమే సరైన దిశ అని అన్నారు.

ఈ కార్యక్రమంలో దామర్‌గిద్ద మండల పార్టీ అధ్యక్షులు నర్సింహారెడ్డి, టిఆర్ఎస్ నాయకులు డాక్టర్ చారి తదితరులు పాల్గొన్నారు.

# జడ్చర్లలో నూతన ఫైర్ స్టేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి...



**జడ్చర్ల, జూలై 25 ( ప్రజా జ్యోతి ):**

జడ్చర్ల పట్టణంలో అత్యవసర అగ్నిమాపక సేవలను మరింత వేగవంతంగా, సమర్థవంతంగా ప్రజలకు అందించాలనే లక్ష్యంతో మున్సిపాలిటీ పరిధిలోని నేషనల్ దాబా సమీపంలో నూతనంగా నిర్మించనున్న ఆధునిక ఫైర్ స్టేషన్ భవనానికి జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణలో అగ్నిమాపక శాఖ సేవలు అత్యంత కీలకమైనవని పేర్కొన్నారు. పట్టణం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించే విధంగా అన్ని ఆధునిక సౌకర్యాలతో కూడిన ఫైర్ స్టేషన్ నిర్మాణం చేపట్టడం ఎంతో అవసరమైందని అన్నారు. ఈ ఫైర్ స్టేషన్ అందుబాటులోకి రావడంతో జడ్చర్ల పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో సంభవించే అగ్నిప్రమాదాలు, రోడ్డు ప్రమాదాలు, ఇతర విపత్తుల సమయంలో సత్వర సహాయక చర్యలు చేపట్టేందుకు వీలు కలుగుతుందని తెలిపారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, జడ్చర్ల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే దిశగా నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ప్రజలకు నాణ్యమైన ప్రభుత్వ సేవలు చేరేలా అవసరమైన ప్రతి అభివృద్ధి పనిని ప్రణాళికాబద్ధంగా పూర్తి చేస్తున్నామని, భవిష్యత్‌లో కూడా నియోజకవర్గ అభివృద్ధికి మరిన్ని కీలక ప్రాజెక్టులను తీసుకువస్తామని ఆయన హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# జలసిరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



**గద్వాల జూలై 25(ప్రజా జ్యోతి ప్రతినిధి)**

:ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షాలు తక్కువగా కురిసే అవకాశం ఉన్నందున అందుబాటులో ఉన్న నీటి వనరులను సంరక్షించుకోవడంతో పాటు జలసిరి కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని జోగుళాంబ గద్వాల జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు అన్నారు. శనివారం గద్వాల ఎంపీడీవో కార్యాలయంలో జలసిరి కార్యక్రమంపై మహిళా సంఘాల ప్రతినిధులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఐదు ఎకరాల లోపు భూమి కలిగిన రైతులకు పంట కుంటల నిర్మాణాన్ని ప్రోత్సహించి,ఆగస్టు 15లోగా వాటి నిర్మాణాన్ని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పంట కుంటల్లో నిల్వ చేసిన నీటితో రైతులు ఆరుతడి పంటలను సాగు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. అలాగే కమ్యూనిటీ,వ్యక్తిగత ఇంకుడు గుంతల నిర్మాణం ద్వారా భూగర్భ జలాల మట్టం పెరుగుతుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో నీటి కొరత పరిస్థితులు తలెత్తకుండా జలసిరి కార్యక్రమాన్ని ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీకాంత్,ఏపీడీ శ్రీనివాస్,గద్వాల ఎంపీడీవో శైలజ,ఏపీఎంలు, సీసీలు,మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఆషాఢ తొలి ఏకాదశి సందర్భంగా మల్దకల్ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు



**మల్దకల్ జూలై 25(ప్రజా జ్యోతి):**

జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలంలోని నడిగడ్డ ఇలవేల్పు శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయం ఆషాఢ శుద్ధ తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం భక్తజనాలతో కిక్కిరిసిపోయింది. తెల్లవారుజాము నుంచే వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు "గోవిందా... గోవిందా..."నామస్మరణతో బారులు తీరుతూ స్వామివారిని దర్శించుకుని పుణ్యఫలాన్ని పొందారు. ఈ సందర్భంగా ఆలయంలో అర్చకులు,వాల్మీకి పూజారుల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు,అర్చనలు,విశేష పూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక వంశీయుడు శ్రీ కృష్ణ మాన్య పట్వారి ప్రహ్లాదరావు, ఈవో సత్యచంద్రారెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసి,క్రమబద్ధంగా దర్శనం కల్పించారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. ఆలయ ప్రాంగణమంతా గోవింద నామస్మరణతో మారుమోగగా,భక్తులు అపారమైన భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. దివ్య దర్శనం అనంతరం తమ కోరికలు నెరవేరాలని ప్రార్థిస్తూ ఆధ్యాత్మిక అనుభూతిని ఆస్వాదిం చారు. పర్వదినం సందర్భంగా మల్దకల్ క్షేత్రం భక్తి పారవశ్యంతో కళకళలాడింది.



# లైంగిక వేధింపులకు పాక్సో చట్టం అడ్డుకట్ట

### -డిప్యూటీ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీరామ్ ఆర్య

**నాగర్ కర్నూల్ : జులై 25 ( ప్రజా జ్యోతి )**

రాష్ట్ర హైకోర్టు ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ మరియు సెక్రెటరీ ఆదేశాల మేరకు నాగర్ కర్నూల్ పట్టణంలోని నైస్ స్కూల్ లో శనివారం చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్ ఫర్ చిల్డ్రన్ స్కీం గురించి విద్యార్థులకు అవగాహనకల్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగాడిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కాన్సిల్ శ్రీరామ్ ఆర్య హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలల హక్కుల పై వివరిస్తూ బాల-బాలికలు తప్పనిసరిగా పాఠశాలలలో చదువుకోవాలని,ఫోన్ వాడకంలో అప్రమత్తంగా ఉండి ఫోన్ లో వచ్చిన మెసేజ్ లను,వీడియోలను ప్రతి దానిని ఇతరులకు ఫార్వర్డ్ చేయడం గానీ వాటికి తిరిగి రిప్లై ఇవ్వడం చేయరాదని,విద్యార్థులు మాదకద్రవ్యాలకు బానిసలు కాకుండా వాటికి దూరంగా ఉండాలని,తల్లిదండ్రులను ఉపాధ్యాయులను గౌరవిస్తూ ఉన్నత స్థితిని పొందాలని,బాలికలపై జరుగుతున్న లైంగిక వేధింపులకు ఫోక్సో చట్టం




అడ్డుకట్ట వేస్తుందని అమ్మాయిలు తమకు ఏ విధమైన సమస్యలు ఉన్నా షీ-టీం కు గాని,చైల్డ్‌హెల్ప్ లైన్ నంబర్ 1098 కు గాని సమాచారం ఇవ్వాలని,న్యాయ సహాయం కొరకు 15100 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేసి లబ్ధి పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# మూతపడే పరిస్థితి నుంచి పాఠశాలకు పునర్జీవం

**-బోడబండ తాండా పాఠశాలను సందర్శించిన డీఈవో**
**-ఆంగ్ల మాధ్యమ బోధనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని**
**-డి ఈ ఓ రమేష్ కుమార్**

**నాగర్ కర్నూల్ : జులై 25 (ప్రజా జ్యోతి)**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పనిచేయాలని జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్ అన్నారు.శనివారం కొల్లాపూర్ మండలంలోని బోడబండ తాండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యా కార్యకలాపాలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం ప్రజావాణిలో అందిన ఫిర్యాదు మేరకు ఏల్లూరు గ్రామంలోని అక్షర ప్రైవేట్ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ నిర్వహించి పరిస్థితులను సమీక్షించి ముందుగా బోడబండ తాండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో తరగతి గదులను పరిశీలించిన డీఈవో,విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి అభ్యాస సామర్థ్యాన్ని అంచనా వేశారు.ఉపాధ్యాయులు బోధిస్తున్న విధానం,విద్యార్థుల హాజరు,పాఠ్యాంశాల బోధన, పాఠశాల నిర్వహణ,విద్యా ప్రమాణాలను పరిశీలించి విద్యార్థుల్లో ఆంగ్ల భాషపై పట్టు పెంపొందించేలా ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలని, ఆంగ్ల మాధ్యమంలో సమర్థవంతంగా బోధన సాగించే విధంగా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని,ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల్లో విశ్వాసాన్ని మరింత పెంచేలా ఉపాధ్యాయులు తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించాలని కోరారు.బోడబండ తాండా పాఠశాల గత కొన్నేళ్లుగా విద్యార్థుల కొరతను ఎదుర్కొన్నదని గత ఐదేళ్ల కాలంలో కేవలం ఇద్దరు విద్యార్థులు మాత్రమే ఈ పాఠశాలకు హాజరవుతుండటంతో పాఠశాల కొనసాగింపే ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఈ విద్యాసంవత్సరం ప్రారంభంలో ఒక్క విద్యార్థి కూడా నమోదు కాకపోవడంతో పాఠశాలను మూసివేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని,అయితే గ్రామ ప్రజలు,తల్లిదండ్రులు,ప్రజా ప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు,ఉపాధ్యాయులు కలిసి చేసిన కృషి ఫలితంగా ప్రస్తుతం పాఠశాలలో 40 మంది విద్యార్థులు చేరడం సంతోషకరమైన విషయమని,ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలంటే సమాజం భాగస్వామ్యం అత్యంత అవసరమని,బోడబండ తాండా గ్రామస్తులు చూపిన చొరవ ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తుందని,ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతోందని,రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అవసరమైన సౌకర్యాలను కల్పిస్తోందని,ఉచిత పాఠ్యపుస్తకాలు,ఏకరూప దుస్తులు,నోట్‌బుక్స్,మధ్యాహ్న భోజనం,ఇతర విద్యా సామగ్రిని రాష్ట్ర ప్రభుత్వం



అందిస్తోందని ఈ అవకాశాలను వినియోగించుకొని తల్లిదండ్రి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని,విద్యతో పాటు క్రమశిక్షణ,వ్యక్తిత్వ వికాసం, విలువలతో కూడిన బోధన ప్రభుత్వ పాఠశాలల్లో అందుతోందని పాఠశాల సందర్శన సందర్భంగా గ్రామస్తులు,మాజీ జడ్పీటీసీ హనుమంత్ నాయక్ డీ.ఈ.వో కు వినతిపత్రం సమర్పించి గ్రామంలో ప్రీ-ప్రైమరీ తరగతులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని,విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిన నేపథ్యంలో మరో ఉపాధ్యాయుడిని నియమించాలని,విద్యార్థుల సంఖ్యకనుగుణంగా ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాలన్నారు.

వినతిపత్రాన్ని స్వీకరించిన డీఈవో సంబంధిత అంశాలను పరిశీలించి నిబంధనల మేరకు చర్య తీసుకుంటామని అన్నారు.అనంతరం కొల్లాపూర్ మండలంలోని ఏల్లూరు గ్రామంలో కొనసాగుతున్న అక్షర ప్రైవేట్ పాఠశాలను డీఈవో ఆకస్మికంగా తనిఖీ చేసి పాఠశాలలో తగిన మౌలిక వసతులు లేవని ప్రజావాణిలో అందిన ఫిర్యాదు నేపథ్యంలో ఈ తనిఖీ చేపట్టినట్లు తెలిపారు.పాఠశాలలో విద్యార్థుల నమోదు వివరాలు, ఉపాధ్యాయుల అర్హతలు,హాజరు రిజిస్టర్లు,తరగతి గదుల పరిస్థితి,తాగునీరు,మరుగుదొడ్లు,భద్రతా ప్రమాణాలు, ఇతర సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం

మండల విద్యాధికారి (ఎంఈఓ)తో ఫోన్‌లో మాట్లాడిన మరోసారి పూర్తి స్థాయిలో తనిఖీ నిర్వహించి సమగ్ర నివేదికను సమర్పించాలని ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విద్యాసంస్థ పనిచేసినా ఉపేక్షించబోమని,విద్యార్థుల భవిష్యత్తుతో రాజీ పడే పరిస్థితిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని,ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు.

డిఇఓ వెంట జిల్లా టెస్ట్‌బుక్ మేనేజర్ నరసింహ, ఎంఐఎస్ కోఆర్డినేటర్ స్వామి,ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఉన్నారు.

## అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ఎమ్మార్పీఎస్ నాయకుడు టైగర్ జంగయ్యను పరామర్శించిన పద్మశ్రీ మందకృష్ణ మాదిగ

**జడ్చర్ల, జూలై 25 (ప్రజా జ్యోతి):**

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో మొదటి నుంచి క్రియాశీలకంగా పనిచేస్తున్న నాయకుడు టైగర్ జంగయ్య మాదిగ అనారోగ్యంతో చికిత్స పొందుతున్న నేపథ్యంలో, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ శనివారం జడ్చర్లలోని కృష్ణారెడ్డి ఆస్పత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా టైగర్ జంగయ్య ఆరోగ్య పరిస్థితిపై వైద్యుడు డాక్టర్ శ్రీధర్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు అందించిన చికిత్స వివరాలను తెలుసుకుని, జంగయ్య త్వరగా కోలుకునేలా మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. అలాగే జంగయ్యకు ధైర్యం చెబుతూ మనోధైర్యాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బచ్చలకూర వినోద్ మాదిగ, కరాటే శ్రీను మాదిగ, లవ్లీ మాదిగ, పడిగళ్ల సురేష్ మాదిగ, గాలి యాదయ్య మాదిగ, బాలు, బీమ్‌రాజ్, దశరథం, శ్రీరాములు, కాశిమ్, గట్టయ్య, గుట్ట విజయ్, విజయ్‌కుమార్, శేఖర్, యాదయ్య, సురేష్‌కుమార్, రాజు, కృష్ణయ్య, శంకర్ నాయక్, సంపత్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఇటిక్యాలలో బి ఎల్ ఎ లతో ఎస్ ఐ ఆర్ పై ప్రత్యేక సమావేశం నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్





**అలంపూర్ డివిజన్ (ప్రజా జ్యోతి) జూలై 25:**

అలంపూర్ నియోజకవర్గం జోగులాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండల కేంద్రంలో అలంపూర్ మాజీ ఎమ్మెల్యే ఏఐసీసీ కార్యదర్శి డా. ఎస్.ఏ.సంపత్ కుమార్ ఇటిక్యాల మండల బి ఎల్ ఎల తో ఎస్ఐఆర్ పై శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు.రాష్ట్రంలో ఎస్ఐఆర్ అమలులో అలంపూర్ నియోజకవర్గం 4వ స్థానంలో,ఉమ్మడి పాలమూరులో తొలి స్థానంలో ఉందని తెలిపారు.బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేస్తూ ప్రజలతో నిరంతరం అనుసంధానంగా ఉండాలని బిఎల్ ఎ లకు సూచించారు. కాంగ్రెస్ అనుకూల ఓట్లను తొలగించే కుట్రలుజరుగుతున్నాయని ఆరోపిస్తూ,ప్రతి బిఎల్ఎ అప్రమత్తంగా ఉండి ఓటర్లను కాపాడాలని తెలిపారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎస్ఐఆర్ ఇన్‌చార్జి సిద్దేశ్వర్, మండల నాయకులు, బిఎల్ ఏ లు తదితరులు పాల్గొన్నారు.

## బూత్ స్థాయిలో పార్టీ బలోపేతం ఎస్ఐఆర్ అమలుపై దిశానిర్దేశం సంపత్ కుమార్



**అలంపూర్ డివిజన్ (ప్రజా జ్యోతి)జూలై 25:**

అలంపూర్ మాజీ ఎమ్మెల్యే ఏఐసీసీ కార్యదర్శి డా. ఎస్.ఏ.సంపత్ కుమార్ శనివారం ఎర్రవల్లి మండల కేంద్రంలో బి ఎల్ఎ లతో ముఖాముఖి సమావేశంనిర్వహించారు.ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎస్ఐఆర్ ఇన్‌చార్జి సిద్దేశ్వర్‌తో కలిసి పాల్గొన్న ఆయనకు మండల నాయకులు ఘన స్వాగతం పలికారు.సమావేశంలో పార్టీ సంస్థాగత బలోపేతం, బూత్ స్థాయి కార్యాచరణ,ఎస్ఐఆర్ కార్యక్రమం అమలు, ప్రజా సమస్యలను పార్టీ దృష్టికి తీసుకెళ్లే విధానం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.అలంపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంలో బిఎల్ఎ ల పాత్ర కీలకమని డా.సంపత్ కుమార్పేర్కొన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలనుగ్రామస్థాయిలో ప్రతి ఓటరికి చేరేలా ప్రచారం చేయాలని సూచించారు.ప్రతి బూత్‌లో పార్టీని ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు కార్యకర్తల మధ్య సమన్వయంతో పనిచేస్తూ పార్టీ అప్పగించినబాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశంలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎస్ఐఆర్ ఇన్‌చార్జి సిద్దేశ్వర్, అలంపూర్ నియోజకవర్గ బిఎల్ ఎల ఇన్‌చార్జి షేక్షావలి ఆచారి,ఎర్రవల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పుటాన్‌దొడ్డి వెంకటేష్ యాదవ్, మండల ఇన్‌చార్జులు, జిల్లా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



# ప్రి ప్రైమరి విద్య భవిష్యత్ విద్యకు పునాది

## -ఇందిరమ్మ ఇళ్లను సకాలంలో పూర్తి చేయాలి
## -జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్





**నాగర్ కర్నూల్: జులై 25ప్రజా జ్యోతి**

ప్రీ ప్రైమరీ తరగతులు,ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలపై జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.శనివారం నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని తెలకపల్లి మండలం గౌరారం గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రీ ప్రైమరీ తరగతులను,గ్రామంలో నిర్మాణంలోఉన్న ఇందిరమ్మ ఇండ్లను జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేసి,ప్రీ ప్రైమరీ తరగతుల విద్యా ప్రమాణా లు,గృహ నిర్మాణాల పురోగతిపై అధికారులు తీసుకుంటున్న చర్యలను ప్రత్యక్షంగా పరిశీలించి పలు సూచనలు చేశారు.మొదటగా గౌరారం గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రీ ప్రైమరీ తరగతులను.సందర్శించిన చిన్నారులతో ఆప్యాయంగా మాట్లాడి వారి అభ్యాస స్థాయిని తెలుసుకున్నారు.తరగతులకు హాజరవుతున్న విద్యార్థుల సంఖ్య,బోధన విధా నం,అందుబాటులో ఉన్న విద్యా సామగ్రి,పిల్లలకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి ఉపాధ్యాయులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రీ ప్రైమరీ విద్య పిల్లల భవిష్యత్ విద్యాభ్యాసానికి బలమైన పునాది అని,చిన్నారుల్లో నేర్చుకునే ఆసక్తిని పెంపొందించేలా ఆటల ద్వారా బోధన,నాణ్యమైన విద్యా వాతావరణం కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు.ప్రతి చిన్నారి క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించాలని,ప్రీప్రైమరీ తరగతులను సమర్థవంతంగా నిర్వహించి లక్ష్యాలను విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.అనంతరం నిర్మాణంలోఉన్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించి పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు.గృహ నిర్మాణాల్లో ఎలాంటి జాప్యం లేకుండా పనులను వేగవంతం చేసి,నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని,లబ్ధిదారులకు అవసరమైన సాంకేతిక సహాయం,మంజూర్లు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.అంతకుముందు తెలకపల్లి మండల కేంద్రంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్)ప్రక్రియలో భాగంగా కొనసాగుతున్న ఓటర్ల డిజిటలైజేషన్ కార్యక్రమాన్ని పరిశీలించి డిజిటలైజేషన్ పనుల పురోగతి, నమోదుచేసిన ఓటర్లవివరాలు,పెండింగ్ దరఖాస్తులపై అధికారులను అడిగి తెలుసుకుని అర్హులైన ఓటరు వివరాలు ఖచ్చితంగా నమోదు కావాలని, డిజిటలైజేషన్ ప్రక్రియను పారదర్శకంగా,వేగవం తంగా పూర్తి చేసి నిర్ణీత గడువులో లక్ష్యాలను సాధించాలని అధికారులకు సూచించారు.జిల్లాకలెక్టర్ వెంట మండల స్థాయి అధికారులు తదితరులు ఉన్నారు.

# సైబర్ నేరల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## సైబర్ నేరానికి గురైతే 1930 కి సమాచారం ఇవ్వాలి: ఎస్సై రమేష్



**మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి, జులై 25 (ప్రజా జ్యోతి):**

ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని, ఆన్‌లైన్ లావాదేవీలు నిర్వహించే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఉట్కూరు ఎస్ఐ రమేష్ తెలిపారు. ఉట్కూరు మండలం పెద్దపోర్ల గ్రామంలో సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమంతో పాటు గ్రామాలలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న పోలీస్ వాల్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు సైబర్ నేరాలపై సమగ్ర అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఎస్సై రమేష్ మాట్లాడుతూ.. అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, ఓటీపీలు, బ్యాంకు వివరాలు, ఏటీఎం పిన్, సీవీవీ నంబర్లు, యూపీఐ పిన్ వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికీ తెలియజేయవద్దని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే అనుమానాస్పద లింకులు, నకిలీ ఉద్యోగాలు, పెట్టుబడులు, లాటరీలు, కూరియర్, కేవైసీ అప్‌డేట్ పేరుతో జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

పోలీసులు ప్రజలకు మరింత చేరువ అయ్యేందుకు గ్రామాలలో నూతనంగా పోలీసు వాల్ ఏర్పాటు చేయడం జరుగుతుందని అత్యవసర పరిస్థితుల్లో పోలీసు సేవలను త్వరగా పొందేందుకు పోలీస్ వాల్ ఎంతో ఉపయోగపడుతుందని, ఇందులో అత్యవసర సంప్రదింపు నంబర్లు, పోలీసు సేవలకు సంబంధించిన ముఖ్యమైన సమాచారం అందుబాటులో ఉంటుందని వివరించారు. అలాగే సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా గోల్డెన్ అవర్ లో 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని, సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు.

# జిల్లా నుంచి బూత్ స్థాయి వరకు కాంగ్రెస్ సంస్థాగత నిర్మాణం బలోపేతం చేయాలి

## : డీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో నిర్ణయం



**మహబూబ్‌నగర్, జూలై 25 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జిల్లా కాంగ్రెస్ కమిటీ విస్తృత స్థాయి సమావేశంలో పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్టం చేయాలని నాయకులు నిర్ణయించారు.

ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్ రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డితో పాటు టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏపీ మిథున్ రెడ్డి హాజరయ్యారు. సమావేశంలో జిల్లా నుంచి మండల, గ్రామ, బూత్ స్థాయి వరకు పార్టీ కమిటీల ఏర్పాటు పురోగతిని సమీక్షించారు. ఇంకా మిగిలిన ప్రాంతాల్లో కమిటీల ఏర్పాటు వేగవంతం చేసి పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి అర్హులైన లబ్ధిదారునికి చేరేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలతో నిరంతరం మమేకమై పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు విస్తృతంగా వివరించి కాంగ్రెస్ ప్రభుత్వంపై విశ్వాసాన్ని మరింత పెంపొందించాలని పిలుపునిచ్చారు.

ప్రతి నాయకుడు, కార్యకర్త గ్రామాలు, బూత్ స్థాయిలోకి వెళ్లి కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. జిల్లా కాంగ్రెస్ కమిటీని రాష్ట్రంలో ఆదర్శవంతమైన సంస్థగా తీర్చిదిద్దేందుకు అందరూ సమిష్టిగా పనిచేయాలని, పార్టీ బలోపేతమే ప్రతి కార్యకర్త లక్ష్యంగా ఉండాలని నాయకులు పిలుపునిచ్చారు.సమావేశంలో టీజీఎంఎఫ్‌సీ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, మేయర్ గుమ్మల మమత శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, మూఢా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ అనిత మధుసూదన్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు సత్తూర్ చంద్రకుమార్ గౌడ్, వివిధ విభాగాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, జిల్లా కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలి

**మహబూబ్‌నగర్, జూలై 25 (ప్రజా జ్యోతి బ్యూరో):**

జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ, మండల, డివిజన్ స్థాయి పార్టీ కమిటీల ఏర్పాటు అంశంపై జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యవర్గ విస్తృతస్థాయి సమావేశం శనివారం మహబూబ్‌నగర్ నగరంలోని డీసీసీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచందర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి నెల రెండో శనివారం పార్టీ కమిటీల సమావేశాలను తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసేలా కమిటీలను సమర్థవంతంగా పనిచేయించాలని పిలుపునిచ్చారు. అలాగే నియోజకవర్గాల్లో నిర్వహించే ప్రతి ప్రభుత్వ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను భాగస్వామ్యం చేస్తూ, సమన్వయంతో కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్, దేవరకద్ర ఎమ్మెల్యే ఎం. మధుసూదన్ రెడ్డి, తెలంగాణ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఏపీ మిథున్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ అనిత మధుసూదన్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు సత్తూరి చంద్రకుమార్ గౌడ్, వివిధ విభాగాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, జిల్లా కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# వ్యాధినిరోధక టీకాలు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా అందించాలి

## డీఎంహెచ్‌వో డా. ఏ. శ్రీనివాసులు

**మహబూబ్‌నగర్, జూలై 25 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

జిల్లాలో ప్రతి చిన్నారికి జాతీయ వ్యాధినిరోధక టీకాల షెడ్యూల్ ప్రకారం సకాలంలో టీకాలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా. ఏ. శ్రీనివాసులు వైద్య సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఆయన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదిర పరిధిలోని మాచన్‌పల్లి తాండాలో నిర్వహిస్తున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలతో మాట్లాడుతూ, పుట్టినప్పటి నుంచి ప్రతి చిన్నారికి జాతీయ టీకాల షెడ్యూల్ ప్రకారం ఎలాంటి విరామం లేకుండా టీకాలు వేయాలని సూచించారు. అలాగే సీజనల్ వ్యాధుల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.అనంతరం చిన్నాయపల్లిలో నిర్వహిస్తున్న పీఎం జన్మన్ ప్రత్యేక వైద్య శిబిరాన్ని పరిశీలించి, అత్యంత వెనుకబడిన గిరిజన వర్గాలకు సమర్థవంతమైన ఆరోగ్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తదుపరి మహ్మదాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, అక్కడ అందిస్తున్న వైద్య సేవలపై వైద్యాధికారి డా. జరీనా బానుతో సమీక్ష నిర్వహించారు. అధిక రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు అందిస్తున్న చికిత్స వివరాలను పరిశీలించారు.గర్భిణీలకు గర్భం దాల్చిన తొలి దశ నుంచే క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, రక్తహీనతతో బాధపడుతున్న వారిని గుర్తించి తగిన చికిత్స అందించాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో సురక్షిత ప్రసవాలు జరిగేలా ముందస్తు బర్త్ ప్లానింగ్ అమలు చేయాలని వైద్య సిబ్బందికి డీఎంహెచ్‌వో ఆదేశించారు.



# సోలార్ మోడల్ గ్రీన్ ఎనర్జీని అభివృద్ధి చేయాలి

### –జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్



**నాగర్ కర్నూల్ : జులై 25 ( ప్రజా జ్యోతి )**

జిల్లా లోని మోడల్ గ్రామాల్లో ఇంటికి,వ్యవసాయ పంపుసెట్లకు సౌర విద్యుత్ అందించేలా వ్యవసాయ రైతులకు అవగాహన కల్పించాలి తూడుకుర్తి, కొండారెడ్డిపల్లి గ్రామాల్లో పూర్తి స్థాయి సోలార్ ఎనర్జీని అభివృద్ధి చేసి సోలార్ వినియోగాన్ని గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా ప్రోత్సహిస్తూ, స్వయం సమృద్ధి కలిగిన గ్రీన్ ఎనర్జీ గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోం

దని,ఈ నేపథ్యంలో నాగర్‌కర్నూల్ జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాలను మోడల్ సోలార్ గ్రీన్ ఎనర్జీ గ్రామాలుగా అభివృద్ధికి 100% సాధించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలోని తూడుకుర్తి గ్రామం,బల్మూరు మండలంలోని కొండారెడ్డిపల్లి గ్రామాల్లో కొనసాగుతున్న పనులపై అధికారులతో ఆరా తీశారు.శనివారం జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ భవనంలో సంబంధిత గ్రీన్ ఎనర్జీ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్‌మాట్లాడుతూ గ్రామాలలో ఎంపిక చేసిన ప్రతి ఇంటికి సౌర విద్యుత్ అందించడం,వ్యవసాయ రంగంలో వినియోగిస్తున్న పంపుసెట్లను కూడా దశలవారీగా సోలార్ విద్యుత్‌తో అనుసంధానం చేసేలా కృషి చేయాలని,రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణతోపాటు విద్యుత్ రంగంలో స్వయం సమృద్ధి సాధించేందుకు పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగాన్ని ప్రోత్సహిస్తోందని గ్రామీణ ప్రాంతాల్లో సౌర విద్యుత్ వినియోగాన్ని పెంచడం ద్వారా రైతులపై విద్యుత్ భారం తగ్గడమే కాక నిరంతర విద్యుత్ సరఫరాకు అవకాశం ఏర్పడు

తుందని,అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామంలో ఇప్పటికే విజయవంతంగా అమలవుతున్న సోలా

ర్ విద్యుత్ నమూనాను ప్రస్తావిస్తూ ఆ గ్రామంలో ప్రతి ఇంటికి,అలాగే 7.5 హెచ్‌పీ సామర్థ్యం గల వ్యవసాయ పంపుసెట్లకు సౌర విద్యుత్ సరఫరా విజయవంతంగా కొనసాగుతోందని,అక్కడి ఫలి

తాలను ఆదర్శంగా తీసుకుని, అదే తరహాలో జిల్లాలోని నాగర్ కర్నూల్ మండలం తుడుకుర్తి, బల్మూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామాల్లోనూ పూర్తి స్థాయిలో సోలార్ విద్యుత్ అమలుకు రైతులకు అవగాహన కల్పించాలని ఎంపిక చేసిన గ్రామాల్లో ప్రస్తుతం ఉన్న గృహ జ్యోతి విద్యుత్ కనెక్షన్ల సంఖ్య,విద్యుత్ వినియోగం,వ్యవసాయ పంపుసెట్ల మొత్తం సంఖ్య,వాటి హార్స్‌పవర్ సామర్థ్యం,ప్రస్తుతం వినియోగిస్తున్న విద్యుత్ వివరాలకు సోలార్ ఎనర్జీగా మార్చేందుకు రైతు

లకు,ప్రజలకు అవగాహన కల్పించి ప్రోత్సహించా

లని సూచించారు.తూడుకుర్తి గ్రామంలో 2 కే డబ్ల్యూ ఆర్.టి.ఎస్ ప్లాంట్లను ఏర్పాటు చేసినట్లు, 907 గృహ జ్యోతి కలెక్షన్లు ఉన్నాయని,సోలార్ ఎనర్జీ ఏర్పాటుకు అణువుగా ఉన్న 639 ఇండ్లను గుర్తించి 78 ఇండ్లకు సోలార్ విద్యుత్ కనెక్షన్లు అందించడం జరిగిందని,బల్మూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామంలో 2 కె డబ్ల్యూ ఆర్.టి.ఎస్ ప్లాంట్ ఏర్పాటుతోపాటు గ్రామంలో ఉన్న 114 గృహ జ్యోతి కలెక్షన్లు ఉన్నాయని 101 ఇండ్లు సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాట్లని పూర్తి చేశామని,అదేవిధంగా తుడుకుర్తిలో 633 విద్యుత్ అవ

సరాల కోసం 7.5 పంపుసెట్లు వినియోగంలో ఉన్నాయని,98 వ్యవసాయ మోటార్లకు సోలార్ విద్యుత్ కనెక్షన్లు అందజేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కు అధికారులు వివరించారు.సమావేశంలో తెలంగాణ యస్.పి.డి.సి.ఎల్ డియర్ మోహన్ రెడ్డి,డిఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు బకాయిలపై రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీస్తాం

- ‘ఫీజు బకాయి -- బీజేపీ లడాయి’ కార్యక్రమం విజయవంతం చేయాలి
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు దుప్పల్లి నారాయణ



**వనపర్తి, జూలై 25 (ప్రజాజ్యోతి):**

రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దుప్పల్లి నారాయణ డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు వనపర్తి జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో శనివారం యువమోర్చా జిల్లా అధ్యక్షుడు అరవింద్ ఆధ్వర్యంలో ‘ఫీజు బకాయి -- బీజేపీ లడాయి’ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ జిల్లా అధ్యక్షుడు దుప్పల్లి నారాయణ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వనపర్తి నియోజకవర్గంలోని వివిధ కళాశాలల విద్యార్థులతో కలిసి చేపట్టనున్న ‘ఫీజు బకాయి -- బీజేపీ లడాయి’ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు బాసెటి శ్రీనివాసులు, మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అలివేలమ్మ, యువమోర్చా నాయకులు చింతకాయల శివ, కాట్రావత్ వెంకటేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# తొలి ఏకాదశి సందర్బంగా శనేశ్వర స్వామికి తిలతైల అభిషేకాలు

**నాగర్ కర్నూల్ : జులై 25 (ప్రజా జ్యోతి)**

శ్రీ పరాభవ నామ సంవత్సరం ఆషాడ మాసం శుద్ధ ఏకాదశి తొలి ఏకాదశి శనివారం దేవత నక్షత్రం శనివారం బీజినేపల్లి మండల పరిధిలోని నంది వడ్డేమాన్ గ్రామంలోని శ్రీశనేశ్వర స్వామికి భక్తులచే శని గ్రహదోష నివారణకు స్వామివారికి తిలతైలా అభిషేఖాలు భక్తితో వేదమంత్రచరణల మధ్య జరిగాయి.శ్రీసార్థాసప్త జేష్టమాత సమేత శనేశ్వర స్వామికి ప్రత్యేక తిలతైల అభిశేఖాలు నిర్వహించారు.ఈ సందర్బంగా ఆలయ ప్రధాన అర్చకులు డాక్టర్ గవ్వమఠం విశ్వనాథ శాస్త్రి మాట్లాడుతూ ఈ మాసంలో స్వామివారిని కొలిచినా స్వామి సంతృప్తి పొంది విశేష ఫలితాన్ని ఇస్తారని,జన్మ రిత్యా,గోచార రీత్యా శనిగ్రహ దోష నివారణకు స్వామివారిని శక్తిమేర పూజించాలని అన్నారు.అనంతరం ఆలయంలో గోన బుద్ధారెడ్డి కాలంనాటి బ్రహ్మసూత్రం గల పరమ శివునికి భక్తులచే రుద్రాభిషేఖాలు,అర్చనలు,దీపారాధన నందీశ్వర స్వామికి ప్రత్యేక పూజలను భక్తులచే నిర్వహించారు.అనంతరం భక్తులకు ఆశీర్వచనం తీర్థ ప్రసాదాల పంపిణీ చేశారు.ఈకార్యక్రమంలో ఆలయ ఆలయ చైర్మన్ వెల్దండ గోపాల్ రావు, గ్రామ సర్పంచ్ టి.సుగుణమ్మ,కమిటీ సభ్యులు



కెంచె రాజేష్, ప్రభాకరచారి,పుల్లయ్య,అడ్వకేట్ వీర శేఖర్ చారి,శ్రీకాంత్ రెడ్డి,ఆలయ ఆర్చకులు శాంతి కుమార్,ఉమమహేశ్వర్,సిబ్బంది గోపాల్ రెడ్డి భక్తులు,మహిళలు పాల్గొన్నారు.

# బీజేపీ వాట్సాప్ యూనివర్సిటీ ప్రచారాలకు వాస్తవాలు చెంపపెట్టు

### బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్.ఆర్.రెడ్డి



నారాయణపేట ప్రతినిధి జూలై 25 (ప్రజా జ్యోతి)

అధికారం ఎంత బలంగా ఉన్నా, చైతన్యవంతమైన యువత సంకల్పం ముందు తలవంచక తప్పదని జెన్ జీ ఉద్యమం మరోసారి నిరూపించిందని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్. రాజేందర్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గతంలో చెప్పిన ‘దేశం కోసం అవసరం వచ్చినప్పుడు ఇండియా రియాక్ట్ అవుతుంది’ అనే మాటలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. నేడు దేశ యువత అదే విషయాన్ని చేతల్లో చూపించిందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా పరీక్షల నిర్వహణలో చోటుచేసుకున్న అవకతవకలకు వ్యతిరేకంగా యువత చేపట్టిన ప్రజాస్వామ్యబద్ధమైన ఉద్యమం ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం స్పందించక తప్పలేదని పేర్కొన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దేశ యువత పోరాట స్ఫూర్తికి దక్కిన విజయంగా ఆయన అభివర్ణించారు. రాజకీయాలకు అతీతంగా విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం, పరీక్షల వ్యవస్థలో పారదర్శకత కోసం దేశవ్యాప్తంగా చేసిన ఉద్యమం కేంద్ర ప్రభుత్వాన్ని బాధ్యత వహించేలా చేసిందన్నారు. విద్యార్థుల ఉద్యమాన్ని అణచివేయడానికి కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలకు దిగినా, యువత ఏమాత్రం వెనక్కి తగ్గకుండా ప్రజాస్వామ్యబద్ధంగా తమ నిరసనను కొనసాగించిందన్నారు. ఏ అహంకార ప్రభుత్వమైనా ప్రజల ముందు తలవంచాల్సిందేనని పేర్కొన్నారు. సమస్య ప్రారంభమైనప్పుడే ప్రభుత్వం బాధ్యతాయుతంగా స్పందించి ఉంటే ఇంతదాకా వచ్చేది కాదన్నారు. విద్యార్థుల ఆవేదనను నిర్లక్ష్యం చేయడమే కాకుండా బిజెపి వాట్సప్ యూనివర్సిటీ తమ ప్రభుత్వ తప్పులను కప్పిపుచ్చే ప్రయత్నం చేసిందన్నారు. ధర్మేంద్ర రాజీనామా బీజేపీ వాట్సప్ యూనివర్సిటీకి చెంప పెట్టు కొట్టిందన్నారు. ఇకపై దేశంలో ఏ విద్యార్థి కూడా పరీక్షల అవకతవకల వల్ల నష్టపోకుండా కఠినమైన, పారదర్శకమైన పరీక్షల విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఒక మంత్రి రాజీనామాతో ఈ అంశం ముగిసిపోదని, విద్యార్థుల్లో విద్యా వ్యవస్థపై సంపూర్ణ విశ్వాసం నెలకొనే వరకు సంస్కరణలు కొనసాగాలని స్పష్టం చేశారు. దేశ యువత సాధించిన ఈ విజయం భవిష్యత్తులో మరింత ఆత్మవిశ్వాసాన్ని నింపుతుందన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్రం చెలగాటం.!

- నీట్ లీక్‌కు మోడీదే బాధ్యత!
- మోడీ రాజీనామా చేయాలంటూ వనపర్తిలో కొవ్వొత్తుల ర్యాలీ




**వనపర్తి, జూలై 25 (ప్రజాజ్యోతి):**

నీట్ ప్రశ్నాపత్రం లీక్ ఘటనతో విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతిందని ఆరోపిస్తూ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం వనపర్తిలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. రాజీవ్ చౌరస్తా నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు భారీ ఎత్తున కొవ్వొత్తులతో ర్యాలీ చేపట్టి విద్యార్థులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడిందని విమర్శించారు. నీట్ పరీక్ష నిర్వహణలో జరిగిన వైఫల్యానికి కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని, ప్రశ్నాపత్రం లీక్‌కు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల నిరసనలపై పోలీసులతో బలప్రయోగం చేయించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని మండిపడ్డారు. ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్ర మోడీ బేషరతుగా రాజీనామా చేసి విద్యార్థులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పారదర్శక పరీక్షా వ్యవస్థను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కౌన్సిలర్లు, యువకులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.